సాక్షి
ప్రకాశం
శనివారం । 25 । మే । 2024



తమ్ముడిని చంపేసిన రైల్వే టీసీ
అన్నదమ్ముల మధ్య ఆస్తి విభేదాలతో అన్న కొట్టిన దెబ్బలకు తాళలేక తమ్ముడు మృతి చెందాడు. అన్న రైల్వే టీసీగా పనిచేస్తుండగా తమ్ముడు పెయింటర్. - 8లో..



ఇందిరా కాలనీలో దొంగల బీభత్సం
ఒంగోలు నగరంలోని ఇందిరా కాలనీలో అర్ధరాత్రి దొంగలు రెచ్చిపోయారు. ఒంటరిగా ఉన్న వృద్ధురాలిపై దాడిచేసి ఆభరణాలు కాజేశారు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
39.2/29.5

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రగ్బీ జిల్లా జట్టు ఎంపిక

తాళ్లూరు (ముండ్లమూరు): ప్రకాశం జిల్లా రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా జూనియర్ (18 ఏళ్ల వయసు లోపు) బాల బాలికల జట్ల ఎంపిక ఈ నెల 27వ తేదీన మండలంలోని బొద్దికూరపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఎస్ రవిప్రసాద్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటలో తెలిపారు. రగ్బీ పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఈ నెల 27వ తేదీ ఉదయం 10 గంటలకు వయసు ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, నాలుగు పాస్ ఫొటోలతో హాజరు కావాలని కోరారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 30, 31 తేదీల్లో భీమిలిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని కార్యదర్శి ఎస్ శ్రీకాంత్ గణేష్ తెలిపారు.

డీఎల్‌పీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

మార్కాపురం టౌన్: మార్కాపురం డివిజన్ పంచాయతీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జీ శ్రీనివాసులును సస్పెండ్ చేస్తూ కలెక్టర్ దినేష్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీనివాసులు మార్కాపురంలోని డీఎల్‌పీఓ కార్యాలయంలో ఒక మహిళా ఉద్యోగిని వేధింపులకు గురిచేయడంతో ఆమె జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశారు. దీనితో డీపీవో విచారణ నిర్వహించి కలెక్టర్‌కు నివేదిక పంపడంతో శ్రీనివాసులును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఈవీఎంల ధ్వంసం కేసులో నిందితుడికి బెయిల్

దర్శి: ఈవీఎంలు ధ్వంసం చేసిన కేసులో నిందితుడు, టీడీపీ నాయకుడు వీసీరెడ్డికి బెయిల్ మంజూరైంది. దర్శి సబ్ జైల్‌లో ఉన్న వీసీరెడ్డి శుక్రవారం బెయిల్ పై బయటకు వచ్చారు. ఈ నెల 13వ తేదీన జరిగిన ఎన్నికల్లో దర్శి పట్టణంలోని పోలింగ్ బూత్‌లో ఈవీఎంలు పగులగొట్టిన వీసీరెడ్డిని పోలీసులు పట్టుకుని ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. 22వ తేదీన అద్దంకి కోర్టులో హాజరుపరచగా కోర్టు 14 రోజులు రిమాండ్ విధించారు.

సెల్యూట్ కొట్టలేదని..

- అటెండర్‌పై భగ్గుమన్న ఉన్నతాధికారి
- నెలజీతం కట్ చేయాలంటూ సూపరింటెండెంట్‌కు ఆదేశం

ఒంగోలు: చదువు సంస్కారాన్ని నేర్పిస్తుందంటారు.. కానీ ఆ ఉన్నతాధికారి తన హోదాను మరచి వ్యవహరించారు. కలెక్టరేట్‌లో ఒక ఉన్నతాధికారి కారిడార్‌లో వెళ్తుండగా మరో విభాగం కార్యాలయ అటెండర్ దాన్ని గమనించలేదు. తాను వస్తుంటే అటెండర్ లేచి సెల్యూట్ కొట్టకపోవడంతో సదరు ఉన్నతాధికారి భగ్గుమన్నారు. అటెండర్ పనిచేసే విభాగం ఉన్నతాధికారిని ఉద్దేశించి ఏకవచనంతో సంభోదిస్తూ ఎక్కడికెళ్లారంటూ హూంకరించారు. 10.40 గంటలు దాటినా ఎందుకు రాలేదంటూ మహిళా అధికారులను సంబోధించిన తీరుకు అక్కడివారు అవాక్కయ్యారు. అటెండర్‌ను చూపిస్తూ "వీడికి పనీపాటా లేదు.. వీడెందుకు ఇక్కడ.. నెలరోజుల జీతం కోత వేయండి" అంటూ కార్యాలయ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. అయితే సదరు విభాగానికి చెందిన మహిళా అధికారిణి ఒకరు అప్పటికే అధికారిక విధుల్లో ఉండగా మరో ఉన్నతాధికారి విజయవాడలో ఆన్‌డ్యూటీలో ఉన్నారు. ఇవేమీ గమనించకుండా ఇంత పెద్ద ఎత్తున ఆగ్రహానికి కారణం ఆ ఉన్నతాధికారిని అటెండరు గుర్తించి సెల్యూట్ కొట్టకపోవడమేనన్న చర్చ నడుస్తోంది. చివరకు అక్కడకు వచ్చిన విజిటర్స్‌ను సైతం మీకు ఇక్కడేం పని అంటూ భగ్గుమన్నారు. ఈ సన్నివేశం ఇలా జరుగుతున్న సమయంలో ఆ మార్గంలో వెళుతున్న మరో విభాగపు ఉద్యోగి పైనా మండిపడ్డారు. నేను ఇక్కడ మాట్లాడుతుంటే మా మధ్యగుండా వెళతావా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఏం జరుగుతుందో తెలియక ఆ ఉద్యోగి నీళ్లు నమిలాడు. చివరకు ఆ తంతును గమనిస్తున్న మీడియా ప్రతినిధిపై కూడా ఐడీ కార్డు చూపించాలని, లేకుంటే ఇక్కడనుంచి వెళ్లాలంటూ హెచ్చరించడం కొసమెరుపు. ఇటీవల జరుగుతున్న సమావేశాలన్నింటిలో ఇదే విధంగా ఆయన దూషణలకు దిగుతున్నారంటూ ప్రభుత్వ విభాగాల్లోని పలువురు అధికారుల మధ్య చర్చ సాగుతోంది.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రూ.5 కోట్లు

కనిగిరి రూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు, అభివృద్ధికి రూ.5 కోట్లు మంజూరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ జే ఉషారాణి తెలిపారు. స్థానిక కళాశాలలో శుక్రవారం సీపీడీసీ సభ్యులు, కళాశాల సిబ్బంది, ఏపీ ఈడబ్ల్యూడీసీ ఇంజినీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఎం ఉషా 2024 పథకం కింద మంజూరైన నిధులను కళాశాలలో నూతన తరగతి గదుల నిర్మాణం, కళాశాల భవనాల పునరుద్ధరణ, భౌతిక, డిజిటల్ తరగతులలో మౌలిక వసతుల కల్పన, వైఫై కనెక్టివిటీ, నాలుగు కాంపోనెంట్స్‌కు వినియోగిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, కళాశాల సీపీడీసీ సభ్యుడు ముక్కు బాలకష్టారెడ్డి, జెడ్పీటీసీ మడతల కస్తూరి రెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమణారెడ్డి, రాచమల్ల శ్రీనివాసులరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

వేసవి దుక్కులు
లాభాలు మెండు..

ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసేందుకు రైతులు వేసవి దుక్కులు దున్నుకుంటున్నారు. తొలకరికి ముందే వేసవి దుక్కులతో రైతులకు బహుళ ప్రయోజనాలున్నాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఇప్పటికే రైతుల కోసం రైతు భరోసా కేంద్రాల్లో సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేస్తున్నారు. వరి, కంది, శనగ, జొన్న, మినుములు, పెసలు, పచ్చిరొట్ట విత్తనాలైన జనుము, జీలుగ, పిల్లిపెసర విత్తనాలు సబ్సిడీపై అందుబాటులో ఉంచారు.



తాళ్లూరులో దుక్కి దున్నుతున్న రైతు

- ఖరీఫ్‌కు సిద్ధమవుతున్న రైతన్న
- ఆర్బీకేల్లో రైతుల కోసం సబ్సిడీపై విత్తనాలు
- ఈ సీజన్‌కు 8893 క్వింటాళ్లు కేటాయింపు
- వేసవి దుక్కులతో క్రిమి కీటకాలు నాశనం, కలుపు సమస్యకు చెక్

ఒంగోలు సెంట్రల్: ఖరీఫ్ పంటల సాగుకు రైతన్నలు సమాయత్తమవుతున్నారు. పంటలు వేయటానికి ముందు పొలాల్లో వేసవి దుక్కులు దున్నుతున్నారు. జిల్లాలో సాధారణంగా ఖరీఫ్‌లో 9,25,767.5 ఎకరాల్లో పలు రకాల పంటలు సాగవుతాయి. అందులో అత్యధికంగా 4,34,883.5 ఎకరాల్లో ప్రధాన పంటలు సాగవుతాయి. అందులో 1,82,507 ఎకరాల్లో కంది, పత్తి 78,905 ఎకరాలు, మిరప 59,682 ఎకరాలు, మిరప, వరి 35,195 ఎకరాల్లో, మినుము 6,300 ఎకరాల్లో, పచ్చ పెసర 2652.5 ఎకరాలు, ఆముదాలు 4,307.5 ఎకరాల్లో ఇతర ఉద్యాన పంటలు, కూరగాయలు 60,232 ఎకరాలు, పొగాకు 5102.5 ఎకరాల్లో సాగు చేయనున్నారు. ఖరీఫ్‌లో పంటలు సాగు చేసే రైతులకు కావాల్సిన విత్తనాలను రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా అందుబాటులో ఉంచింది. ఖరీఫ్ సీజన్‌కు 8893 క్వింటాళ్ల విత్తనాలు కేటాయించారు.

విత్తనాల కేటాయింపు ఇలా...
జిల్లాలో 616 రైతు భరోసా కేంద్రాల పరిధిలో సబ్సిడీపై ప్రభుత్వం విత్తనాల సరఫరాకు సిద్ధమైంది. వరి విత్తనాలు క్వింటా రూ.500 సబ్సిడీపై 4 వేల క్వింటాళ్లు సరఫరా చేయనున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ జేడీఏ శ్రీనివాసరావు తెలిపారు. అందులో వరిలో బీపీటీ-5204 రకం 2 వేల క్వింటాళ్లు, ఎన్‌ఎల్‌ఆర్ 33892 రకం 800 క్వింటాళ్లు, ఆర్‌ఎన్‌ఆర్ 15048 రకం 400 క్వింటాళ్లు, కేఎన్‌ఎల్ 1638 రకం 400 క్వింటాళ్లు, ఎంపీయూ 1271 రకం 400 క్వింటాళ్లు సిద్ధంగా ఉన్నాయి. జూన్ 10వ వరకు ఈ విత్తనాలు పంపిణీ చేయనున్నారు.

కంది రకంలో 1500 క్వింటాళ్లు అందులో ఎల్‌ఆర్‌జీ 750 క్వింటాళ్లు, బీఎస్ఎంఆర్ 736 రకం 750 క్వింటాళ్లు జూన్ 15 వరకు 30 శాతం సబ్సిడీపై అందించనున్నారు. మినుములు 30 శాతం సబ్సిడీపై పలు రకాలు 500 క్వింటాళ్లు, పచ్చ పెసలు 120 క్వింటాళ్లు, పచ్చిరొట్ట విత్తనాలైన జనుము, జీలుగ, పిల్లిపెసర 50 శాతం సబ్సిడీపై 2773, శనగలు 40 శాతం సబ్సిడీపై జేజీ-11 రకం 1999 క్వింటాళ్లు, కాగ్-2 రకం 2000 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

వేసవి దుక్కులు ఎప్పుడు చేయాలంటే..
పంట కోసిన తర్వాత తొలకరి వానలు కురిసే వరకు భూమి ఖాళీగా ఉంటుంది. రెండు నుంచి మూడు నెలల పాటు భూమి ఎండకు ఎండి గట్టిపడుతుంది. మే, జూన్ నెలల్లో తొలకరి వానలు పడగానే రైతులు తమ పొలంలో ఏ పంట వేయాలో, వేయబోయే పంటను బట్టి ఎన్నిసార్లు భూమి దున్నాలో నిర్ణయించుకుంటాడు. ఏటా ఒకే లోతుకు భూమిని దున్నడం వల్ల నల్లరేగడి భూముల్లో అడుగున గట్టి పొరలు ఏర్పడతాయి. ఈ పొరల వల్ల వర్షపు నీరు భూమిలోకి ఇంకకుండా చేయటమే కాకుండా మొక్క వేళ్లు లోపలికి వెళ్లకుండా చేస్తాయి. దీంతో అవి గిడసబారిపోతాయి. ఇది పంట దిగుబడిపై అధిక ప్రభావం చూపుతుంది. వేసవి కాలంలో దుక్కులు లోతుగా దున్నటం వల్ల అధిక ప్రయోజనాలు పొందవచ్చు. భూమి లోపల ఉండే క్రిమికీటకాలు భూ పైపొరల్లోకి వచ్చి ఎండ వేడిమికి చనిపోతాయి. ఎండాకాలం దుక్కి లోతుగా దున్నటంతో వర్షాకాలంలో పడే వర్షాలకు భూమి గుల్లగా తయారై పంట వేయడానికి అనుకూలంగా మారుతుంది. అలా కాకుండా తొలకరిలో వర్షాలు పడిన తర్వాత దుక్కి దున్నితే పంటకు అనుకూలంగా ఉండదు. రైతులు ఏ పంట సాగుచేయాలనుకున్నా వేసవి దుక్కులతోనే అధిక ప్రయోజనం చేకూరుతుంది. వీటి వల్ల కొన్ని రకాల క్రిమికీటకాలు లార్వా, గుడ్డు దశలో నశిస్తాయి. ఈ దుక్కల వల్ల రసాయన మందుల వినియోగాన్ని తగ్గించుకోవచ్చు.

లోతుగా దున్నుకోవాలి



రైతులు వేసవి దుక్కులు వేయటం వల్ల అనేక లాభాలున్నాయి. ఆరు నుంచి ఏడు అంగుళాల పైన నేల దున్నినట్లయితే భూమి మరింత సారవంతమవుతుంది. రైతులు చెరువులు, కుంటల్లోని మట్టిని పంట పొలాలకు వేసుకుంటే భూసారం పెరుగుతుంది. రైతుల కోసం సబ్సిడీ విత్తనాలను ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచాం.
– ఎస్.శ్రీనివాసరావు, వ్యవసాయశాఖ జేడీఏ, ఒంగోలు

ఖరీఫ్‌లో సాధారణ సాగు
9,25,767.5
ఎకరాలు

ప్రధాన పంటలు సాగు
4,34,883.5
ఎకరాలు

ప్రయోజనాలు..

- మట్టి ఉష్ణోగ్రత పెరుగుతుంది
- వేసవి దుక్కుల వల్ల భూమి వదులుగా అవుతుంది. తద్వారా భూమిలోని క్రిమికిటకాలు పూర్తిగా చనిపోతాయి.
- వర్షపు నీరు భూమిలోకి ఇంకుతుంది. పంట వేసినప్పుడు మొక్క వేర్లు లోపలికి నీరు వెళ్లి బలంగా ఉంటాయి.
- చీడ పురుగులు నశిస్తాయి. తద్వారా పురుగు మందుల వాడకం తగ్గుతుంది. భూములు సారవంతంగా మారతాయి.
- అధిక వర్షాలు కురిసినా భూమి కోతకు గురి కాకుండా ఉంటుంది.
- భూమి పొరల్లోకి గాలి వెళ్లి మొక్కల వేరు వ్యవస్థ విస్తరించి మొక్కలు బలంగా ఉంటాయి.
- లోతు ఎక్కువగా దున్నటం వల్ల కలుపు గింజలు బయట పడతాయి. వాటిని పక్షులు తినటంతో కలుపు కూడా తగ్గుతుంది. కొన్ని రకాల కలుపు మొలక బయటపడి వేడికి చనిపోతాయి.
- అధిక వర్షాలు కురిసినా భూమి కోతకు గురి కాకుండా ఉంటుంది.
- మొలక శాతం పెరుగుతుంది. సకాలంలో పంట వేసుకోవటానికి పొలం అనుకూలంగా మారుతుంది.
- సేంద్రియ, రసాయన ఎరువులు కలిపి దున్నినట్లుగా మారుతుంది.
- పత్తి, మిరప, మొక్కజొన్న వంటి మోడులు భూమిలో అడుగు భాగానికి చేరి కుళ్లి ఎరువుగా మారతాయి.
- అలాగే చెరువు, కుంట మట్టిని వేసి పొలం దున్నటంతో భూసారం మరింత పెరుగుతుంది.

జంతు సంరక్షణ జిల్లా నోడల్ అధికారిగా ఏఎస్పీ

ఒంగోలు టౌన్: జంతు సంరక్షణ జిల్లా నోడల్ అధికారిగా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు నియమితులయ్యారు. జిల్లా పోలీసు కార్యాలయం శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన నియామకానికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర జంతు సంక్షేమ బోర్డు జారీ చేసిన మార్గదర్శకాలను అనుసరించి జంతువుల అక్రమ రవాణా, గోవధ నిరోధానికి గాను జిల్లా ఒక నోడల్ అధికారిని నియమించారు. ఇక నుంచి జంతువుల అక్రమ రవాణా, గోవధ విషయంలో న్యాయస్థానం ఆదేశాలు, నిబంధనలు ఉల్లంఘించినా కఠిన చర్యలు తీసుకుంటారన్నారు. ఇందులో భాగంగా ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించి ఆంధ్రప్రదేశ్ గోవధ నిర్మూలన, జంతు సంరక్షణ చట్టం-1977, జంతు రవాణా నిబంధనల చట్టం- 1978, జంతు రవాణా (సవరణ) నిబంధనలు-2001 చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని నోడల్ అధికారులను ఆదేశించారు. గోవధ, పశువుల అక్రమ రవాణాపై పోలీసు కంట్రోలు రూం వాట్సప్ నంబర్ 9121102266కు కానీ డయల్ 112,100కు కానీ నోడల్ ఆఫీసర్ ఫోన్ నంబర్ 9121102101కు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతారని ప్రకటనలో పేర్కొన్నారు.

30 నుంచి ఉచిత వక్త శిక్షణ తరగతులు

ఒంగోలు టౌన్: స్టూడెంట్స్, టీచర్స్, ఎడ్యుకేటర్స్, పేరెంట్స్ (స్టెప్) ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీ నుంచి రెండో రోజుల పాటు ఉచిత వక్త శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు స్టెప్ జిల్లా కార్యదర్శి ఎం. ధనరాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు జిల్లా తాళ్లూరు మండలంలోని శ్రీ రమణరావు, సావిత్రమ్మ ధ్యాన ఆరోగ్య ఆశ్రమంలో తరగతులు జరుగుతాయన్నారు. శిక్షణలో పాల్గొనేవారికి ఉచిత వసతి, భోజనం, మెటీరియల్ కూడా ఉచితంగా అందజేస్తారన్నారు. శిక్షణ తరువాత సర్టిఫికెట్ ఇస్తారన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 29వ తేదీ సాయంత్రంలోపు వేదిక వద్దకు హాజరుకావాలని, పూర్తి వివరాలకు 9491710716 నంబర్‌కు ఫోన్ ద్వారా సంప్రదించాలని కోరారు.

పకడ్బందీగా ఓట్ల లెక్కింపు



ఆర్‌ఓ, ఏఆర్‌ఓల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్



పాల్గొన్న ఆర్‌ఓ, ఏఆర్‌ఓలు

- ఎన్నికల సంఘం మార్గదర్శకాలు కచ్చితంగా పాటించాలి
- ఆర్‌ఓ, ఏఆర్‌ఓల శిక్షణలో కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జరగనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని, అందుకు పూర్తి అవగాహన ఉండాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సూచించారు. శుక్రవారం స్పందన భవనంలో ఆర్‌ఓ(రిటర్నింగ్ అధికారులు), ఏఆర్‌ఓ (అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు), అదనపు సహాయ రిటర్నింగ్ అధికారులకు కౌంటింగ్ ప్రక్రియపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఎన్నికల సంఘం నిబంధనల మేరకు చిన్న పొరపాటు కూడా జరగకుండా నిర్వహించాలన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియపై పూర్తి అవగాహనతో ఉండి విధులు నిర్వహించాలన్నారు. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. సిబ్బంది ఉదయం 5 గంటలకే కేటాయించిన లెక్కింపు కేంద్రాల వద్దకు చేరుకోవాలన్నారు. లెక్కింపు కేంద్రంలో సెల్‌ఫోన్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు. ఈవీఎంల ఓట్ల లెక్కింపు ప్రక్రియ, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియతో పాటు సర్వీసు ఓట్ల లెక్కింపు ప్రక్రియపై అవగాహన చేసుకుని పక్కాగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహించాలన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో వివిధ దశల్లో పాటించాల్సిన నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. దీనిలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, డీఆర్‌ఓ శ్రీలత, ఒంగోలు, దర్శి, కనిగిరి, వైపాలెం, కొండపి, గిద్దలూరు అసెంబ్లీ నియోజకవర్గాల ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఈవీఎం, స్ట్రాంగ్ రూముల పరిశీలన

- పాల్గొన్న కలెక్టర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు

ఒంగోలు అర్బన్: సాధారణ ఎన్నికలకు సంబంధించి జరిగిన పోలింగ్ అనంతరం ఈవీఎంలను భద్రపరిచిన రైజ్ ఇంజినీరింగ్ కాలేజిలోని స్ట్రాంగ్ రూములను కలెక్టర్ దినేష్‌కుమార్ శుక్రవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులతో కలిసి పరిశీలించారు. స్ట్రాంగ్ రూములకు వేసిన సీళ్లు, ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు, భద్రతా చర్యలను పర్యవేక్షించారు. అనంతరం అక్కడే ఓట్ల లెక్కింపు కోసం ఏర్పాటు చేస్తున్న కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. కౌంటింగ్ రూముల్లోకి ఈవీఎంలను తీసుకువెళ్లేందుకు ఏజెంట్లను అనుమతించేందుకు ప్రత్యేక బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. లెక్కింపు ఫలితాలను ఎప్పటికప్పుడు డిస్‌ప్లే చేసేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కలెక్టర్‌తో పాటు డీఆర్‌ఓ శ్రీలత, మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతి కుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు రసూల్, కాలే షాబేగ్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలులతో వర్షం

- గాలికి లేచిన గృహాల పైకప్పులు

మార్కాపురం: మార్కాపురం పట్టణంతోపాటు పరిసర గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం 4.30 గంటల నుంచి ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. వేములకోట, కొట్టాలపల్లి, వేములపేట, నికరంపల్లి, చింతగుంట్ల తదితర గ్రామాల్లో ఈదురు గాలులతో వర్షం కురిసింది. మండలంలోని నికరంపల్లి గ్రామానికి చెందిన గుండారెడ్డి నారాయణమ్మ ఇంటి పైకప్పు రేకులు లేచిపోవడంతో సుమారు లక్ష రూపాయల ఆస్తినష్టం జరిగింది. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. తిరిగి 5.30 గంటలకల్లా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

మొట్టుపల్లె గ్రామంలో ఈదురు గాలులు
కొమరోలు: మండలంలోని మొట్టుపల్లె గ్రామంలో భారీ ఈదురు గాలులతో కూడిన వర్షం శుక్రవారం సాయంత్రం కురిసింది. దీంతో నాగం రమణయ్య, నాగం నాగార్జున నివాసాలపై ఉన్న రేకుల షెడ్లు గాలులకు ఎగిరిపోయి పక్కవీధిలో పడ్డాయి. గృహాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. వర్షానికి గృహంలో ఉన్న ధాన్యాలు, సామగ్రి నానిపోయాయి. గుంతపల్లె గ్రామానికి పీరయ్య ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మొట్టుపల్లె గ్రామ సమీపంలో భారీ వృక్షం కూలడంతో పీరయ్యపై పడింది. దీనితో పీరయ్య కాలు విరగడంతో 108 సహాయంతో పీరయ్యను గిద్దలూరు వైద్యశాలకు తరలించారు.



నేలకొరిగిన భారీ వృక్షం



నికరంపల్లిలో ఇంటి పైకప్పు ఎగిరిపోయిన గృహం



మొట్టుపల్లెలో రేకులషెడ్ ఎగిరిపోయిన నివాస గృహాలు

దివ్యాంగ బాలుర వసతి గృహంలో ప్రవేశాలకు ఆహ్వానం



జి అర్చన

ఒంగోలు సెంట్రల్: విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దివ్యాంగ బాలుర విద్యార్థుల వసతి గృహంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జి.అర్చన తెలిపారు. ఒకటో తరగతి నుంచి 12వ తరగతి ఆపైన ప్రత్యేక విద్యాకోర్సులు చదివేవారు అర్హులని చెప్పారు. శారీరక అంగ వైకల్యం, పాక్షిక అంధత్వం, పాక్షిక వినికిడి లోపం కలిగి ప్రభుత్వ వైద్యశాల నుంచి ధ్రువీకరణ పత్రం పొందిన బాలురు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వసతి గృహంలో ఉచిత భోజనం, వసతి, ప్రతి నెలా కాస్మొటిక్స్ అందజేత వంటి సదుపాయం ఉందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అవసరమైన వారికి ప్రత్యేక సహాయకుడి సౌలభ్యం కల్పిస్తారని చెప్పారు. పూర్తి వివరాలకు కార్యాలయం ఫోన్ నంబర్ 0852-281310ను పనివేళల్లో సంప్రదించాలని కోరారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

- జిల్లా విజిలెన్స్ ఏడీ ఈరేష్

ముండ్లమూరు: అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా విజిలెన్స్ ఏడీ ఎం ఈరేష్ అన్నారు. మండలంలోని చిలకలేరు నదీ పరివాహక ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం రావడంతో జిల్లా స్థాయి ఇసుక కమిటీ ఆధ్వర్యంలో పోలవరం ప్రాంతంలో మూకుమ్మడిగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఒక ట్రాక్టర్‌ను సీజ్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలు అతిక్రమించి అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఇసుక అవసరమైన వారు నిబంధనల ప్రకారం సంబంధిత అధికారులను సంప్రదించి ఇసుకను పొందవచ్చన్నారు. తనిఖీల్లో ఎస్ఈబీ సీఐ సుందరరామయ్య, ఇరిగేషన్ ఏఈ మధుసూదనరావు, డీటీ పుల్లారెడ్డి, వీఆర్వో బ్రహ్మతేజ పాల్గొన్నారు.



పట్టుబడిన ట్రాక్టర్

క్లుప్తంగా

ప్రశాంతంగా అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

ఒంగోలు: అడ్వాన్స్‌డ్ టెస్ట్, ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్ష కేంద్రాలను డీఈఓ డి.సుభద్ర, ఇంటర్ బోర్డు ఆర్ఐఓ సైమన్ విక్టర్ పర్యవేక్షించారు. స్వయంగా పలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద ఆరోగ్య కార్యకర్తలను, మందులను, చల్లటి పానీయాన్ని అందుబాటులో ఉంచారు. పదో తరగతి పరీక్షలకు సంబంధించి ప్రథమ భాషా పరీక్షకు 1291 మంది విద్యార్థులకుగాను 530 మంది మాత్రమే హాజరయ్యారు. ఇంటర్ విద్యార్థులు మాత్రం 89.60 శాతం మంది హాజరయ్యారు. ద్వితీయ భాషకు సంబంధించి ఉదయం నిర్వహించిన ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్ష జిల్లా వ్యాప్తంగా 43 సెంటర్లలో నిర్వహించారు. 3909 మంది జనరల్ విద్యార్థులు, 360 మంది ఒకేషనల్ విద్యార్థులు వెరసి 4,269 మంది హాజరుకావాల్సి ఉంది. వారిలో 3555 మంది జనరల్, 322 మంది ఒకేషనల్ విద్యార్థులు హాజరయ్యారు. ద్వితీయ సంవత్సరం ఇంటర్ విద్యార్థులకు సంబంధించి 693మంది జనరల్, 379మంది ఒకేషనల్ విద్యార్థులు హాజరుకావాల్సి ఉంది. వీరిలో 571 మంది జనరల్, 322 మంది ఒకేషనల్ విద్యార్థులు హాజరయ్యారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు కలిపి 5341 మందికి గాను 4786 మంది (89.60శాతం) హాజరయ్యారు.

పని ప్రదేశంలో కొండచిలువ కలకలం


పొద నుంచి బయటకు వచ్చిన కొండచిలువ

రాచర్ల: జాతీయ గ్రామీణ ఉపాధి పనులు చేస్తున్న సమయంలో కొండచిలువ ప్రత్యక్షం కావడంతో కూలీలు భయాందోళనకు గురయ్యారు. ఈ సంఘటన రాచర్ల మండలంలోని అనుమలవీడు గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. అనుమలవీడు సమీపంలోని నక్కాలవాగులో ముళ్లపొదకు కూలీలు నిప్పు పెట్టారు. దీంతో వేడి భరించలేక కొండచిలువ కూలీల వైపు ఒక్కసారిగా దూసుకొచ్చింది. కొండచిలువ దాదాపు 7 అడుగుల పొడవు ఉందని, వ్యవసాయ పొలాల్లోకి వెళ్లిపోయిందని కూలీలు తెలిపారు.

తమ్ముడిని చంపేసిన రైల్వే టీసీ

- ఆస్తి పంపకాల విషయంలో తమ్ముడిపై ద్వేషం పెంచుకున్న అన్న
- గురువారం అర్ధరాత్రి వేళ అన్నదమ్ముల మధ్య మల్లయుద్ధం
- అన్నకొట్టిన దెబ్బలు తాళలేక కన్నుమూసిన తమ్ముడు
- నిందితుడు సౌత్ కోస్టల్ రైల్వేలో టీసీ.. హతుడు పెయింటర్
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఒంగోలు డీఎస్పీ కిషోర్‌బాబు


శివశంకర్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఒంగోలు డీఎస్పీ కిషోర్‌బాబు


శివశంకర్ మృతదేహం

సింగరాయకొండ: అన్నాదమ్ముల మధ్య ఆస్తి విషయంలో తలెత్తిన విభేదాలు హత్యకు దారితీశాయి. అన్న కొట్టిన దెబ్బలు తాళలేక తమ్ముడు చొప్పర శివశంకర్(37) మృతి చెందాడు. ఈ విషాద ఘటన శుక్రవారం తెల్లవారుజామున సింగరాయకొండ మండలంలోని మూలగుంటపాడు పంచాయతీ వెంకటేశ్వరకాలనీలో చోటుచేసుకుంది. సంఘటనా స్థలాన్ని ఒంగోలు డీఎస్పీ ఎం కిషోర్‌బాబు, సీఐ దాచేపల్లి రంగనాథ్ పరిశీలించారు. పోలీసుల కథనం ప్రకారం.. వెంకటేశ్వర కాలనీకి చెందిన చొప్పర శివకృష్ణ, శివశంకర్ ఇద్దరు అన్నదమ్ములు. వీరి తండ్రి జాలయ్య రైల్వేలో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ 2008వ సంవత్సరంలో వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నారు. ఈ క్రమంలో శివకృష్ణ సౌత్ కోస్టల్ రైల్వేలో టీసీగా ఎంపికవడంతో తమ్ముడికి పొలం, ఇంటి స్థలం ఇచ్చి బతుకుదెరువు చూపారు. అప్పటి నుంచి శివశంకర్‌పై ద్వేషం పెంచుకున్న శివకృష్ణ తరచూ గొడవపడుతుండేవాడు. ప్రస్తుతం శివకృష్ణ ఒంగోలులో నివసిస్తుండగా, శివశంకర్ తన తల్లిదండ్రులతో కలిసి మూలగుంటపాడులో జీవిస్తున్నాడు. శివశంకర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అర్ధరాత్రి వేళ వివాదం

కుమార్తెకు పుట్టు వెంట్రుకలు తీస్తున్న నేపథ్యంలో మూలగుంటపాడులో ఉంటున్న తండ్రి జాలయ్యను తీసుకెళ్లేందుకు శివకృష్ణ గురువారం అర్ధరాత్రి వేళ వచ్చాడు. ఈ సందర్భంగా శివకృష్ణ తన తండ్రి జాలయ్యను ఖర్చుల కోసం 5 వేల రూపాయలు అడగ్గా ఇద్దరి మధ్య వాగ్వివాదం ప్రారంభమైంది. తండ్రిని పక్కకు తీసుకెళ్లేందుకు శివశంకర్ అడ్డురాగా.. అన్నాదమ్ముల మధ్య తీవ్ర స్థాయిలో ఘర్షణ చోటుచేసుకుంది. శివకృష్ణ తన తమ్ముడి ఛాతీపై పిడిగుద్దులు గుద్దడంతో పాటు తలపై తీవ్ర గాయం చేశాడు. ఊపిరి తీసుకోవడం కష్టంగా ఉన్న శివశంకర్ తానే స్వయంగా 108కు ఫోన్ చేసి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి ప్రథమ చికిత్స చేయించుకున్నాడు. ఆస్పత్రి వైద్య సిబ్బంది మెరుగైన చికిత్స కోసం ఒంగోలు జీజీహెచ్‌కు సిఫార్సు చేశారు. ఒంగోలు వెళ్తుండగా మార్గమధ్యంలో శివశంకర్ కన్నుమూశాడు. ఈ ఘటనపై తండ్రి జాలయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ దాచేపల్లి రంగనాథ్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎస్సై టి.శ్రీరామ్, సిబ్బంది ఉన్నారు.

వైభవంగా వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు


చంద్రవాహనంపై ఆశీనులైన రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి

యర్రగొండపాలెం: అతి ప్రాచీనమైన మిల్లంపల్లి వేణుగోపాల స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వేడుకగా సాగుతున్నాయి. తొలిరోజు గురువారం అంకురార్పణ, ధ్వజారోహణం, భేరి పూజ, దేవతా ఆహ్వానం, రాయభారం, ఎదుర్కోలు, తెల్లవారు జామున రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. రెండో రోజు శుక్రవారం పగలు స్వామివారు చంద్ర వాహనం, రాత్రి శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. 25న రాత్రి హనుమంత వాహనంపై స్వామివారు దర్శనమివ్వనున్నారు. 26వ తేదీన గరుడ సేవ సందర్భంగా భక్తులు సుదూర ప్రాంతాల నుంచి ఇక్కడికి తరలి వస్తారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో శాంతిభద్రతల దృష్ట్యా సాంస్కృతిక కార్యక్రమాలకు అనుమతి ఇవ్వలేదు. 28న సాయంత్రం రథోత్సవం, 29న రాత్రి అశ్వ వాహనం, 30వ తేదీ పగలు పూర్ణాహుతి, చక్రస్నానం, రాత్రి హంస వాహనంతో వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

ఇందిరా కాలనీలో దొంగల బీభత్సం

- 80 ఏళ్ల వృద్ధురాలి మెడలో బంగారు చైను, చేతి గాజులు చోరీ
- అపస్మారక స్థితిలో పడి ఉన్న వృద్ధురాలు
- ఆస్పత్రికి తరలించిన స్థానికులు


క్లూస్ టీంతో కలిసి ఇంటిని పరిశీలిస్తున్న సీఐ అలీ సాహెబ్

ఒంగోలు టౌన్: నగరం నడిబొడ్డున ఉన్న ఇందిరా కాలనీలో గురువారం అర్ధరాత్రి దొంగలు రెచ్చిపోయారు. ఒంటరిగా నివసిస్తున్న ఓ వృద్ధురాలిపై దాడి చేసి బంగారు ఆభరణాలు కాజేశారు. వన్‌టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని అంబేడ్కర్ భవనం ఎదురుగా ఉన్న ఇందిరా కాలనీలో తిరుమలశెట్టి పార్వతమ్మ అనే 80 ఏళ్ల వృద్ధురాలు నివసిస్తున్నారు. గురువారం అర్ధరాత్రి చుట్టుపక్కల జనాలు మంచి నిద్రలో ఉన్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆమె ఇంట్లోకి చొరబడి నిద్రలో ఉన్న ఆమె మెడలోని బంగారు హారం, బంగారు గాజులు, చెవి కమ్మలు దొంగిలించారు. పార్వతమ్మ భర్త సుబ్బారావు పోస్టుమాన్‌గా పనిచేసి రిటైర్డ్ అయిన కొన్నాళ్లకు మరణించారు. ఈ దంపతులకు సంతానం లేకపోవడంతో బంధువుల అమ్మాయిని దత్తత తీసుకొని పెంచుకున్నారు. ఆమెకు వివాహం చేయగా ఒంగోలులోని సమతా నగర్‌లో నివాసం ఉంటూ రెండు రోజులకోసారి వచ్చి వెళ్తున్నారు. కూతురు, ఆమె భర్త రాయిని బ్రహ్మయ్య శుక్రవారం పార్వతమ్మ ఇంటికి వచ్చారు. గేటు బయట నుంచి గడియ పెట్టి ఉండడంతో కాసేపు చూసి లోపలికి వెళ్లారు. పార్వతమ్మ అపస్మారక స్థితిలో పడి ఉండటంతో అనుమానం వచ్చి చూడగా ఆభరణాలేవీ కనిపించలేదు. లక్ష రూపాయలకు పైగా నగదు కూడా చోరీ చేశారని బంధువు బ్రహ్మయ్య చెబుతున్నారు. సంఘటనా స్థలాన్ని వన్‌టౌన్ సీఐ అలీ సాహెబ్ పరిశీలించారు. క్లూస్ టీంను రప్పించి సాక్ష్యాలు సేకరించారు. బ్రహ్మయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో ఢీకొని యువకుడు దుర్మరణం


సంఘటనా స్థలంలో నాగార్జున మృతదేహం

కొత్తపట్నం: మోటారు సైకిల్‌ను ఫోర్ వీలర్ ఆటో ఢీకొట్టడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన ఒంగోలు–కొత్తపట్నం మధ్యలో నల్లవాగు బ్రిడ్జి సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కొత్తపట్నం మండలం కె.పల్లిపాలెం గ్రామానికి చెందిన సైకం నాగార్జున(29) బేల్దారి పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం వ్యక్తిగత పని నిమిత్తం పల్లెపాలెం నుంచి బైక్‌పై ఒంగోలు వెళ్తున్నాడు. ఈ క్రమంలో నల్లవాగు సమీపంలో ఒంగోలు నుంచి కొత్తపట్నం వైపు ప్రయాణికులతో వస్తున్న ఆటో అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. తలకు బలమైన గాయాలు కావడంతో నాగార్జున అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని ఎస్సై బి.సాంబశివరావు పరిశీలించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో ఏడు గేదెలు మృతి


పొలాల్లో మృతి చెందిన గేదెలు

కొనకనమిట్ల: పొలాల్లో తెగి పడిన విద్యుత్ తీగలు తగిలి మేత మేస్తున్న 7 గేదెలు అక్కడికక్కడే మృత్యువాతపడ్డాయి. ఈ సంఘటన కొనకనమిట్ల మండలం గొట్లగట్టు గ్రామ పొలాల్లో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు.. గొట్లగట్టు గ్రామానికి చెందిన కోమటికుంట వీర నారాయణకు చెందిన 3 గేదెలు, మోరబోయిన మాలకొండయ్యకు చెందిన ఒక గేదె, ఉప్పుటూరి శ్రీనివాసులుకు చెందిన ఒక గేదె, భత్తుల ఆంజనేయులుకు చెందిన ఒక గేదె, భత్తుల చినమాలకొండయ్యకు చెందిన ఒక గేదెను మేత కోసం పొలాల్లోకి తోలారు. గొట్లగట్టు నుంచి నాయుడుపేట ఎస్సీ కాలనీకి వేసిన విద్యుత్ తీగలు పొలాల్లో తెగిపడ్డాయి. అటుగా వెళ్లిన గేదెలు విద్యుత్ తీగలను తొక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాయి. సుమారు రూ.5 లక్షల విలువైన గేదెలు మృత్యువాత పడటంతో బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై విద్యుత్ శాఖ ఏఈ రామకృష్ణను వివరణ కోరగా.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి బాధితులకు న్యాయం చేస్తామని చెప్పారు.

ప్రేమ.. పెళ్లి.. విషాదం!

- ఉరేసుకుని వివాహిత యువతి ఆత్మహత్య
- రెండేళ్ల క్రితం పెద్దలను ఎదిరించి ప్రేమ వివాహం
- భర్త, కుటుంబ సభ్యులే హత్య చేశారని మృతురాలి తల్లి ఆరోపణ


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై శివబసవరాజు

మద్దిపాడు: ప్రేమించిన వ్యక్తి కోసం కన్న తల్లి దండ్రులనే ఎదిరించింది ఆ యువతి. ముక్కోటి దేవతల సాక్షిగా నచ్చినోడినే పెళ్లి చేసుకుంది. అపురూపంగా చూసుకుంటాడని నమ్మిన వ్యక్తే నిత్యం వేధిస్తుండటంతో తీవ్ర మనో వేదనకు గురైంది. ఉరేసుకుని అర్ధంతరంగా తనువు చాలించింది. ఈ విషాద సంఘటన మద్దిపాడు మండలంలోని పన్నూరు గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని పన్నూరు గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ గుండాల బ్రహ్మయ్యకు పాదిలికి చెందిన గగనబోయిన చెన్నమ్మ, బాలమర్ధియ్య కుమార్తె మనీషా(24)తో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్త ప్రేమగా మారింది. రెండేళ్ల క్రితం తల్లిదండ్రులను ఎదిరించి బ్రహ్మయ్యను వివాహం చేసుకుంది. బ్రహ్మయ్య మొదట బేల్దారీ మేస్త్రిగా పని చేసి కలిసిరాకపోవడంతో సొంత గ్రామంలో ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. వీరికి ఓ పాప జన్మించింది. వివాహమైనప్పటి నుంచే అత్తాకోడళ్ల మధ్య తగాదాలు, భార్యాభర్తల మధ్య విభేదాలు పొడచూపాయి. కొద్ది రోజులుగా వేధింపులు ఎక్కువ కావడంతో మనస్తాపం చెందిన మనీషా ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శివబసవరాజు చెప్పారు.

ఇది ముమ్మాటికీ హత్యే

'నా కుమార్తె మనీషా ఆత్మహత్య చేసుకునే అంత పిరికిది కాదయ్యా. బ్రహ్మయ్య, అతని తల్లి కలిసి ఉరేసి చంపారు' అని మృతురాలి తల్లి చెన్నమ్మ ఆరోపించింది. తన బిడ్డకు న్యాయం చేయాలని పోలీసులను వేడుకుంటూ బోరున విలపించింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివబసవరాజు తెలిపారు. మనీషా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కిరాతకుడు

- హైదరాబాద్‌లోని బాచుపల్లిలో భార్యను పాశవికంగా హత్య చేసిన భర్త
- మృతురాలు గొట్లగట్టుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మధులత
- ఘటనపై పలు అనుమానాలు



నిజాంపేట్: కుటుంబ కలహాలు ఓ మహిళ ప్రాణాలు తీశాయి. కర్కోటకుడైన ఓ భర్త.. భార్యను అతిదారుణంగా హత్య చేసి..మృతదేహాన్ని ముక్కలుగా నరికేందుకు యత్నించాడు. బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. దీనిపై శనివారం మృతురాలి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొనకనమిట్ల మండలం గొట్లగట్టు గ్రామానికి చెందిన మధులత(29)కు దర్శికి చెందిన నాగేంద్ర భరద్వాజ్‌తో 2020లో వివాహమైంది. వీరిద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కావడంతో బాచుపల్లి పరిధిలోని సాయి అనురాగ్ కాలనీలోని ఎంఎస్ఆర్ ప్లాజా బి-బ్లాక్‌లో నివాసం ఉంటున్నారు. పెళ్లయిన కొద్దిరోజుల తర్వాత దంపతుల మధ్య విభేదాలు ఏర్పడి తరచు గొడవ పడేవారు. ఈ నేపథ్యంలో మధులత పుట్టింటికి వెళ్లిపోయింది. ఆ సమయంలో గర్భవతిగా ఉన్న మధులత మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఇక నాటి నుంచి భరద్వాజ్ భార్య వద్దకు వెళ్లలేదు. బంధువులు జోక్యం చేసుకుని ఈ ఏడాది ఫిబ్రవరి 22న ఇద్దరికి రాజీ కుదుర్చి మధులతను భరద్వాజ్‌తో పంపించారు.

కిరాతకంగా హత్య చేసి..

రాజీ కుదుర్చినా వారిద్దరి మధ్య గొడవలు సద్దుమణగలేదు. ఈ నేపథ్యంలో ఏపీలో ఈ నెల 13న ఎన్నికలు ఉండటంతో తాను పుట్టింటికి వెళ్తానని మధులత చెప్పగా..ఈ నెల 4న ఇద్దరి మధ్య గొడవ ప్రారంభమైంది. విచక్షణ కోల్పోయిన భరద్వాజ్ భార్య తలను నేలకేసి కొట్టి కత్తితో విచక్షణా రహితంగా పొడిచి హత్య చేశాడు. అనంతరం ముక్కలుగా నరికి మాయం చేయాలనుకుని మోకాలి కింద భాగాలను కోసే ప్రయత్నం చేశాడు. వీలుకాక ఈ ప్రయత్నాన్ని విరమించుకుని ప్రమాదంగా చిత్రీకరించే యత్నం చేశాడు. ఇందులో భాగంగా ఇంట్లోని వంట గ్యాస్‌ను లీక్ చేసి భార్య మృతదేహాన్ని ఇంట్లోనే పెట్టి తాళం వేసి కుమారుడితో పరారయ్యాడు. గ్యాస్ వాసన రావడంతో అపార్ట్‌మెంట్ వాసులు పోలీసులకు సమాచారం ఇవ్వగా..పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి తలుపులు బద్దలు కొట్టి గ్యాస్‌ను నిలిపివేశారు. అనంతరం మధులత మృతదేహాన్ని చూసి ఖంగుతిన్నారు.

హత్య చేసి స్నేహితుడి ఇంటికి....

భార్యను హత్య చేసిన భరద్వాజ్ చందానగర్‌లోని స్నేహితుడు శ్రీనివాస్ ఇంటికి వెళ్లాడు. తాను భార్యను హత్య చేశానని, తన కుమారుడిని జాగ్రత్తగా చూసుకోవాలని చెప్పి భార్యను పొడిచిన కత్తితోనే తాను సైతం పొడుచుకున్నాడు. దీంతో భయాందోళనకు గురైన శ్రీనివాస్ 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. భరద్వాజ్‌కు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

పసికందు ముందే హత్య

కుమారుడు శ్రీజై (17 నెలలు) ఇంట్లో ఆడుకుంటుండగా.. బాలుని ముందే భరద్వాజ్ భార్యతో గొడవ పడి హత్య చేశాడు. మే 4న రాత్రి సుమారు 9 గంటల సమయంలో ఈ హత్య చేసినట్లు పోలీసులు పేర్కొంటున్నారు.

పోలీసుల వివరణ

మధులత హత్య కేసు విషయమై బాచుపల్లి ఎస్‌హెచ్ఓ ఉపేందర్‌ను వివరణ కోరగా ఈ నెల 4న తమకు సుమారు రాత్రి 12 గంటల సమయంలో సమాచారం వచ్చిందని తెలిపారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని భరద్వాజ్‌ను అదుపులోకి తీసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. అదే రాత్రి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీకి తరలించడం జరిగిందన్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న కారణంగా మీడియాకు కేసు వివరాలు వెల్లడించలేదన్నారు.

అన్నీ అనుమానాలే..

మధులత హత్యపై పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ నెల 4న హత్య జరగగా పోలీసులు ఈ విషయాన్ని గోప్యంగా ఉంచారు. మీడియాకు తెలుపలేదు. అలాగే అపార్ట్‌మెంట్ వద్ద ఇంత గొడవ జరిగినా విషయం బయటకు పొక్కలేదు. హత్యకు గురైన మధులత కుటుంబ సభ్యులు సైతం హత్య జరిగిన 20 రోజుల తర్వాత ఈ విషయాన్ని శనివారం మీడియాకు వెల్లడించడం కూడా ఆశ్చర్యానికి గురిచేస్తోంది.